క్లుప్తంగా

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వివాదం

దొంగ ఓటు వేస్తున్నారనే నెపంతో వాదన

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఓ మహిళతో బీఆర్‌ఎస్ నేతలు దొంగ ఓటు వేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీ నేతల మధ్య వాదన చోటుచేసుకుంది. పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఏర్పాటు చేసిన 237 పోలింగ్ కేంద్రంలో భార్గవితో బీఆర్‌ఎస్‌నేతలు దొంగ ఓటు వేయిస్తున్నారనే కారణంతో కాంగ్రెస్ నేతలు వారితో వాదనకు దిగారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు నేతలను సముదాయించి పంపించారు.

ఓటు గల్లంతు



సాయమ్మ

కేశంపేట: అల్వాల గ్రామానికి చెందిన కాకునూర్ సాయమ్మ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అక్కడ ఓటు లేదని అధికారులు తెలిపారు. దీంతో నిరాశగా ఆమె వెనుదిరిగింది. 40 సంవత్సరాలుగా తను ఓటు హక్కు వినియోగించుకుంటున్నానని తెలిపింది. అధికారుల నిర్లక్ష్యమో లేక బిఎల్‌ఓ నిర్లక్ష్యమో కాని తన ఓటు ఓటర్ లిస్టులో లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళల కోసం 'సఖి'

మీర్‌పేట: రంగురంగుల బెలూన్‌లు... పచ్చ తివాచీ... తోరణాలు.. ఇదేదో శుభకార్యం కోసం ఇంటిని అందంగా ముస్తాబు చేయడం కోసం కాదు. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం వినూత్నంగా ఏర్పాటు చేసిన సఖీ పోలింగ్ స్టేషన్. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా సఖీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఓటింగ్ శాతం పెంచేందుకే ప్రత్యేకంగా తీర్చిదిద్దామని అధికారులు తెలిపారు. ఇక్కడ మహిళా సిబ్బందినే నియమించడం విశేషం.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

హుడాకాంప్లెక్స్: శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థ వారి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర ఆలయం 39వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి సమక్షంలో వేద పండితులు కృష్ణమాచార్యులు, వంశీధరచార్యులు, రామకృష్ణచార్యులు, శ్యాంసుందర్ వేదోచ్చారణాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ధనంరెడ్డి, కోశాధికారి రమణ, సభ్యులు వేణుబాబు, సుబ్బారావు, మురళీ కౌండిన్య, శ్రీనివాసరావు, భోగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

- పల్లెబాట పట్టిన ఓటర్లు
- ఇబ్రహీంపట్నంలో 2కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఇబ్రహీంపట్నం ప్రధాన చౌరస్తా నుంచి దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. గురువారం గ్రామాలకు ఓటువేసేందుకు వెళ్లిన ఓటర్లు తిరిగి నగరానికి పయనమవడంతో ఇబ్రహీంపట్నంలో తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యింది. ఉదయం హైదరాబాద్ వైపు ఒకే దారిలో గ్యాప్ లేకుండా కార్లు, బైక్‌లు, ప్రైవేట్ వాహనాలు వెళ్తుండటంతో విపరీతమైన ట్రాఫిక్ నెలకొంది. అంబేడ్కర్ చౌరస్తా వద్ద కనీసం రోడ్డు దాటేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సాగర్ వైపు వెళ్లే రహదారి రద్దీగా ఉంటే... సాయంత్రం 6 గంటల అనంతరం హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు వాహనాలతో రద్దీగా మారింది. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల టాప్‌లపై కూర్చొని ప్రయాణం చేశారు. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు తీవ్రంగా శ్రమించారు.

'పట్నం'లో 74.82 శాతం పోలింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో 74.82శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 319 పోలింగ్ స్టేషన్లలో 3,27,583 మంది ఓటర్లకు 2,45,105 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎన్నిల అధికారి అనంతరెడ్డి తెలిపారు. యాచారంలో 59 బూత్‌లకు గాను 38,489, మంచాలలో 45 బూత్‌లకు గాను 33,997మంది, ఇబ్రహీంపట్నంలో 76 బూత్‌లకు గాను 56,578 మంది, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 139 బూత్‌లకు గాను 1,16,041 మంది ఓటర్లు ఓటు వేశారు.

ముగిసిన పోలింగ్

ఆయా కేంద్రాల వద్ద బారులుతీరిన ఓటర్లు

- చేవెళ్లలో సాయంత్రం ఐదు దాటినా కొనసాగిన ఓటింగ్
- చెదురు మదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం

చేవెళ్ల/షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్: అన్ని గ్రామాల్లో పోలింగ్ ఉదయం 7గంటలనుంచి ప్రారంభమై సాయంత్రం 5వరకు ముగిసినా మూడు గ్రామాల్లో మాత్రం సాయంత్రం 5 దాటిన కూడా పోలింగ్ కొనసాగింది. ఊరేళ్ల, ఆలూరు, ఖానాపూర్ గ్రామాల్లో సాయంత్రం 5 దాటిన కూడా క్యూలైన్‌లో ఓటర్లు ఉండడంతో వారిని ఓటు వేసే వరకు క్యూలైన్‌లో ఉంచి ఓటు వేయించారు. 5 దాటిన తరువాత ఓటు వేసేందుకు వచ్చే వారిని అనుమతివ్వలేదు. రాత్రి ఏడు దాటిన తరువాత కూడా పోలింగ్ జరగడంతో లైట్లు వేసి ఓటింగ్ పూర్తి చేశారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఏవీఎంలను రాజేంద్రనగర్‌లోని లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. ఇక్కడ పోలైన ఓటింగ్‌శాతం 63.9శాతంగా ఉంది.

క్యూలైన్‌లో ఓటర్లు...

షాద్‌నగర్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలు సాయంత్రం ఐదు గంటలు దాటినా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూలైన్‌లో ఉన్నారు.

చెదురు మదురు ఘటనలు..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనంలోని పోలింగ్ బూత్‌లో తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఓటర్లను సముదాయించారు. అల్వాల్, కొత్తపేట, కాకునూరు, చౌలపల్లి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు...

పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీల్ చైర్‌లో వారిని ఓటు వేసేందుకు తీసుకెళ్లారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రశాంతంగా ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల నియమావళిని పాటించాలని అసిస్టెంట్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ సాదన్ రేష్మిపరిమేశ్ అన్నారు. బాకారం, అజీజ్‌నగర్, ముర్తుజాగూడ ఆయా గ్రామాలను పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

కొత్తూరులో.. : కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం మండలంలోని 27 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 7 గంటల వరకు 80 % పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నందిగామ మండలంలో81.84 శాతం పోలింగ్ నమోదైంది.



చేవెళ్ల: ఊరేళ్ల గ్రామంలో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు



కొత్తూరు: ఓటు వేసిన ఎంపీపీ దంపతులు



షాద్‌నగర్‌లో ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడిన ఓటర్లు



కొత్తూరు: గూడూరులో బారులుతీరిన ఓటర్లు



చేవెళ్లలో ఓటే వేసేందుకు వచ్చిన కురు వృద్ధురాలు వీల్ చేర్‌కోసం వేచి ఉన్న దృశ్యం



నందిగామ: వికలాంగుడిని ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సహాయకుడు



ఓటు వేసిన బాలాజీ దేవాలయం మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్



చేవెళ్లలో పోలింగ్ బూత్‌వద్ద ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు



మొయినాబాద్‌రూరల్: ఎన్కేపల్లిలో స్లిప్పుల కోసం ఎగబడ్డ ఓటర్లు



నందిగామ, మామిడిపల్లి గ్రామాలలో ఓటు వేసేందుకు బారులు తీరీన ఓటర్లు



చేవెళ్లలో ఓటు వేసేందుకు సహాయకురాలితో కలిసి వస్తున్న వికలాంగ వృద్ధుడు



మొయినాబాద్‌రూరల్: పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న అసిస్టెంట్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ సాదన్ రేష్మిపరిమేశ్



మొగిలిగిద్దలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో యువకులు

మొరాయించిన ఈవీఎం

మాడ్గుల: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండుగంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. గ్రామంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. తొమ్మిదిగంట ప్రాంతంలో ఈవీఎం మొరాయించింది. టెక్నీషియన్లు వచ్చి రెండు గంటలు శ్రమించి ఈవీఎం మెషీన్‌ను బాగు చేశారు. 11 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది

యాచారంలో

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. యాచారం, మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సేపు ఓటింగ్ నిలిచిపోయింది. సాంకేతిక సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడంతో మళ్లీ పోలింగ్ కొనసాగింది. నందివనపర్తిలో 32 బూత్‌లో ఈవీఎంలు సక్రమంగా పని చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. టెక్నీషియన్లు వాటిని సరిచేయడంతో ఓటింగ్‌ను పునఃప్రాంభించారు.

యువతరం.. నవ వసంతం

మీర్‌పేట: ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. ఓటు హక్కు ఎంతో పవిత్రమైనది.. పరిపాలన విధానానికి ఆయుధం లాంటిది. దీన్ని గుర్తించిన యువ ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటిసారి ఓటేసిన వీరు ఉబ్బితబ్బిబయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిల్చొని ఓటేశారు.

ఉత్సాహంగా ఉంది



మొదటిసారి ఓటింగ్‌లో పాల్గొనడం, ప్రజాస్వామ్యంలో భాగం కావడం ఉత్సాహంగా ఉంది. ఓటు ద్వారా ఉత్తమమైన పాలకులను ఎన్నుకోవచ్చు. భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– రితిక, జిల్లెలగూడ

యువతకు ఉపాధి పెంచాలి



మొదటిసారి ఓటు వేశాను. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయి యువత ఇబ్బందులు పడుతున్నారు. ఫలితాలు వెలువడి గెలిచిన పార్టీ.. ప్రభుత్వం ఏర్పాటు చేశాక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి.

నితిన్, మీర్‌పేట

ఓటు హక్కు ఎంతో విలువైంది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైంది. తొలిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది. యువత అసెంబ్లీతో పాటు స్థానిక సంస్థల్లోనూ ఓటు తప్పనిసరిగా వేయాలి.

–రిషిక, బాలాపూర్ ఎక్స్‌రోడ్డు

టెన్షన్ ఫీల్ అయ్యాను



ఓటు వేసేటప్పుడు టెన్షన్ ఫీల్ అయ్యాను. సేవ చేసే అభ్యర్థికి ఓటు వేశాను. విద్యావంతులు రాజకీయాల్లో ఉండాలి. ప్రజల అవసరాలు గుర్తించి, వారి సమస్యలు తీర్చే వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుపొందాలి.

– సంతోషి, సరూర్‌నగర్

నిర్భయంగా ఓటు వేయాలి



నేను మొదటి సారిగా ఓటు వేస్తున్నాను. ఓటు హక్కు అనేది మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలి

నిఖిత, రావిర్యాల

భవిష్యత్ కల్పించే వారికి నా ఓటు

ఎన్నికల్లో చాలా మంది రాజకీయ నాయకులు ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తారు. కానీ మన సమస్యలను పరిష్కరించే వారికి, భవిష్యత్‌కు భరోసా కల్పించే వారికే ఓటు వేయాలి. గెలిచిన వారు ప్రజా సమస్యలను పరిష్కరించాలి.

– వంశీ, రావిర్యాల

కొనసాగుతున్న మైసమ్మ జాతర



మైసమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత ఏర్పాట్లను పర్యవేక్షించారు. భాస్కర్ నాయక్, అరుణ్‌కుమార్, నాయకులు ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

కాలె యాదయ్యను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- పార్టీ కుండువా కప్పుకొని ఎలా వెళ్తావని నిలదీసిన కార్యకర్త
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

మొయినాబాద్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం మొయినాబాద్ మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అందులో భాగంగా నాగిరెడ్డిగూడ గ్రామానికి వెళ్లిన కాలె యాదయ్యను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. యాదయ్య పార్టీ కండువ వేసుకుని సుమారు ఇరవైమంది అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మాణిక్యం ఎమ్మెల్యేను నిలదీశాడు. కండువా వేసుకొని పోలింగ్ కేంద్రానికి ఎలా వెళ్తావంటూ ప్రశ్నించాడు. దీంతో కోపించిన ఎమ్మెల్యే అడగడానికి నీవెవరు అంటూ వెళ్తుండగా అక్కడ ఒక్కసారిగి కాంగ్రెస్ కార్యకర్తలు చేరి ఆయన్ను నిలదీశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం పెరిగింది. పోలీసులు కలుగజేసుకుని ఎమ్మెల్యే యాదయ్యను అక్కడి నుంచి పంపించారు. దీంతో అక్కడ గొడవ సద్దుమణిగింది.



నాగిరెడ్డిగూడలో ఎమ్మెల్యే వాహనం చుట్టూ చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుచున్న అభ్యర్థులతో పాటు, స్వతంత్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగ్రామమైన కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో, కాంగ్రెస్ అభ్యర్థి కాస్లాబాద్ శంకరయ్య స్వగ్రామమైన నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో, బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య దంపతులు షాద్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజా వరప్రసాద్ దంపతులు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడి ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్‌లో, సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

షాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్, షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి దంపతులు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, గొల్లూరుగూడ గ్రామస్తులతో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుమ్మరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్, గొల్లూరుగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి దంపతులు ఓటు వేశారు.

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల ఎంపీతో పాటు ప్రజా ప్రతినిధులు, బీజేపీ అభ్యర్థి కేఎస్.రత్నం, వారి వారి స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆయన సతీమణి సీత ఎన్కేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. చేవెళ్ల అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కెఎస్ రత్నం తన సతీమణితో కలిసి కేతిరెడ్డిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, బీఆర్‌ఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు స్వప్న హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్కేపల్లిలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. హిమాయత్‌నగర్‌లో మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్ ఓటు వేశారు.



శంకర్‌పల్లి: ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్న చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీ, కౌన్సిలర్లు



మొయినాబాద్‌రూరల్: కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన స్వప్నసతీశ్



మోకిలతండాలోఓటు వేసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్, ఎంపీటీసీ సరిత



బుల్కాపురంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న నవ వధువు